## పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థల చేయూత ఆదర్శనీయం

### రూ.కోటి 20 లక్షలతో పనులు ప్రారంభించిన హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్

మణికొండ, జనవరి 10: పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఆదర్శనీయ నిర్ణయమని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కొత్త చెరువును జీఈఎఫ్ ఇండియా సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలతో కలిసి రూ.కోటి 20 లక్షల సీఎస్ఆర్ నిధులతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ సమాజంలో తమతో పాటు తోటి వారికి చేయూత అందించేందుకు జీఈఎఫ్ ఇండియా ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, జీఈఎఫ్ ప్రతినిధులు అక్షయ్ చౌదరి, అర్చన సురేశ్, ప్రతాప్, మధులి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ఆ నాలా మళ్లీ కూలింది

## నాలాలో పడి పోయిన రెడీ మిక్స్ వాహనం.. పై కప్పు మొత్తాన్ని పునర్నిర్మించాలని స్థానికుల వినతి

అబిడ్స్, జనవరి 10: గోషామహల్ నాలా మరోసారి కుప్ప కూలింది. నాలా మరమ్మతులు చేపడుతుండగా స్లాబ్ వేసేందుకు గాను రెడీ మిక్స్‌తో వచ్చిన లారీని నాలాపై నిలపడంతో కప్పు కుప్ప కూలడంతో రెడీ మిక్స్ వాహనం అందులో పడి పోయింది. మాసాబ్ ట్యాంక్, అఫ్జల్‌సాగర్ మీదుగా నాలా గోషామహల్ చాక్నావాడిల మీదుగా ఎంజీబీఎస్ మూసీ వరకు కొనసాగుతుంది. కొన్నేండ్ల క్రితం ఈ నాలాపై కప్పు నిర్మించడం జరిగింది. ఐతే, ఈ నాలా తరచు కూలడం అధికారులు మరమ్మతులు కొన్నేండ్లుగా చేపడుతున్నారు. చాలా ఏండ్ల క్రితం దారుస్సలాం చౌరస్తాలోని ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచి కార్యాలయం ముందు నాలాపై కప్పు కూలగా అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆ తరువాత గోషామహల్ రోడ్‌లోని భవాని వైన్స్ ముందు భాగం మీదుగా నాలాపై నుంచి భారీ లోడ్‌తో కూడిన లారీ వెళ్తున్న సమయంలో నాలాపై కప్పు కూలి పోయింది. అప్పుడు మరమ్మతులను చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్పా, పక్కాగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, 2022వ సంవత్సరం అక్టోబర్ 23వ తేదీన నాలా హజారి భవన్ పక్క వీధిలో కార్లు, ద్విచక్ర వాహనాలు, కూరగాయల బండ్లు నిలిపి ఉండగా, ఒక్క సారిగా నాలా కుప్ప కూలి కారు, ద్విచక్ర వాహనాలు, కూరగాయల వ్యాపారులు, కూరగాయలు అన్నీ అందులో పడి పోయాయి. అప్పటి రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకుని కూలిన నాలాను సందర్శించి తక్షణమే నాలా మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులను విడుదల చేయగా అధికారులు సంవత్సరం పాటు నాలా మరమ్మతు పనులు చేపట్టారు. నాలా పనులు పూర్తయిన కొద్ది రోజులకే అక్టోబర్ 23వ తేదీన నాలాపై కప్పు మరోసారి కూలిపోగా, పనులు చేపట్టేందుకు గాను నిధులు విడుదలయ్యాయి. కాగా, ఈ రహదారిలో రెండు వెంట్లలో నాలా ప్రవాహం ఉండగా, ఓ వైపు మరమ్మతు పనులు ప్రారంభించారు. నాలాపై కప్పు వేసేందుకు గాను సెంట్రింగ్ పనులు పూర్తి చేసి రెడీ మిక్స్ ద్వారా స్లాబ్ వేసేందుకు చర్యలు తీసుకున్నారు. స్లాబ్ కోసం రెడీ మిక్స్ వాహనం రాగా, మరో వెంట్‌లో దాదాపు 60 శాతం వరకు నాలా పై కప్పును తొలగించి ఉండగా, రెడీ మిక్స్ వాహనాన్ని ఆ రెండో వెంట్ నాలాపై నిలపడంతో బరువుకు నాలాపై కప్పు కుప్ప కూలింది. దీంతో రెడీ మిక్స్ వాహనం అందులో పడి పోయింది.



గోషా మహల్‌లో కూలిన నాలా, నాలాలో పడి పోయిన రెడీ మిక్స్ వాహనం

### సందర్శించిన డీసీ విద్యాధర్, కార్పొరేటర్ లాల్‌సింగ్

గోషామహల్ చాక్నావాడి ప్రాంతంలో నాలాపై కప్పు మరోసారి కూలి రెడీ మిక్స్ వాహనం పడిన విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ పద్నాల్గవ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.విద్యాధర్, ఏఎంఓహెచ్ వెంకటరమణ, ఏఈ మహేందర్, గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్‌లతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ప్రస్తుతం, కొనసాగుతున్న నాలా మరమ్మతు పనులను పరిశీలించారు.

### పక్కా పనులు ఎందుకు చేయడం లేదు?

అఫ్జల్‌సాగర్ నుంచి గోషామహల్, చాక్నావాడీల మీదుగా ప్రవహిస్తున్న నాలాపై కప్పు తరచు కూలుతుండగా అధికారులు పక్కా నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు నాలా పై కప్పు కూలగా అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతు పనులను చేపడుతున్నారని పేర్కొంటున్నారు. దారుస్సలాం రోడ్ నుంచి మొదలుకుని గోషామహల్ ప్రధాన రహదారి మీదుగా చాక్నావాడి నుంచి నాలా గోషామహల్ పోలీస్ స్టేడియం పక్క నుంచి ప్రవహిస్తుంది. ఐతే, దారుస్సలాం, గోషామహల్ ప్రధాన రహదారిపై నిత్యం భారీ ఎత్తున వాహనాల రాక పోకలు సాగుతుంటాయి. ఇక్కడ నాలాపై కప్పు ఏ విధంగా ఉందో అధికారులు పరిశీలించి సర్వే చేయించి మొత్తం నాలా పునః నిర్మాణ పనులను చేపడితే బాగుండేదని స్థానికులు అంటున్నారు.



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

## ఆశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, జనవరి 10: ఆరోగ్య శాఖలో ప్రధానమైన క్షేత్ర స్థాయి సేవలను నిర్వహిస్తూ ఆర్థికపరమైన సమస్యలను ఎదుర్కొంటున్న ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్ రావు నగర్‌లోని ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వారి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అసెంబ్లీలో లేవనెత్తాలని శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఆశా వర్కర్ల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృష్టితో ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వహించే ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మార్చి 23 నుంచి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రసాద్ గౌడ్, రాంచంద్రా రెడ్డి, రాఘవేందర్, దిలీప్ తదితరులు

ఖైరతాబాద్, జనవరి 10: ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చి 23 నుంచి 26 మధ్య తేదీల్లో రవీంద్రభారతిలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు బి.ప్రసాద్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చలన చిత్రోత్సవానికి సంబంధించిన పోస్టర్లను కార్యదర్శి సత్యనారాయణ, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.రామచంద్రా రెడ్డి, దిలీప్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2016 నుంచి ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేపట్టామని, ఈ సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఉత్తమ డాక్యుమెంటరీ, షార్ట్, ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ తదితర రంగాల్లో ఉత్తమ వాటిని ఎంపిక చేసి బహుమతులను అందజేస్తామన్నారు.

## రేవంత్ పాస్ పోర్టును పర్మినెంట్‌గా సీజ్ చేయండి

### కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల చౌకబారు ప్రకటనలు తగవు

### టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ పాటి మీది జగన్మోహన్ రావు

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): నేషనల్ హెరాల్డ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాహుల్ గాంధి, అదే కేసులో ఆరోపణలున్న సోనియాగాంధీ పాస్ పోర్టును సీజ్ చేయాలని టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. మూడు కేసుల్లో మనీ ల్యాండరింగ్ ఆరోపణలున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అలాగే, దేశంలో ముఖ్యమంత్రులలో అత్యధిక క్రిమినల్ కేసులున్న తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి పాస్‌పోర్టును ఏసీబీ కోర్టు పర్మినెంట్‌గా సీజ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై తుప్పేల్ కేసు పెట్టి పాస్ పోర్టు సీజ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలలో కేటీఆర్‌కు ఉన్న చరిష్మాను తగ్గించడం ఎవరి వల్ల కాదని జగన్మోహన్ రావు స్పష్టం చేశారు.

## ఆర్మీ అమరవీరుల కుటుంబాలకు పీఎన్‌బీ చేయూత



సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): దేశ రక్షణలో అమరులైన ఆర్మీ కుటుంబాలకు పంజాబ్ నేషనల్ బ్యాంకు చేయూతను అందిస్తోంది. పీఎన్‌బీ రక్షక్ ప్లస్ బీమా పథకం ద్వారా ఆర్మీ కుటుంబాలకు బాసటగా నిలుస్తోంది. భారత ఆర్మీ విశ్రాంత సుబేదార్ ముఖేశ్ కుమార్ పంజాబ్ నేషనల్ బ్యాంకు ఖాతాదారుడు. ఇటీవల రైలు ప్రమాదంలో ఆయన మరణించారు. దీంతో ఆయన సతీమణి కమలావతి దేవికి బ్యాంకు డిప్యూటీ జోనల్ హెడ్ సంజయ్ మానే, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజీత్ కుమార్ జాలు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఆర్మీ కుటుంబాలకు రక్షక్ పస్ల్ బీమా పథకం ఎంతో దోహదపడుతుందన్నారు.

## సీఏ ఫైనల్‌లో రిషబ్‌కు ఆలిండియా మొదటి ర్యాంకు




సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ విద్యార్థి రిషబ్ ఓస్వాల్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ, ఐఐటీ, నీట్ పరీక్షలు రాసే విద్యార్థులకు పరిమిత సీట్లు మాత్రమే ఉంటాయని, కానీ, సీఏ పరీక్షలు రాసిన వారికి సంవత్సరానికి 40 నుంచి 45 శాతం విద్యార్థులు అర్హత సాధిస్తారన్నారు. అనంతరం, రిషబ్ ఓస్వాల్‌ను మాస్టర్ మైండ్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

## లోక్ సభ ఎన్నికల ఫలితాలపై జాతీయ సెమినార్

### ముగిసిన రెండు రోజుల జాతీయ సెమినార్



సెమినార్‌లో చర్చిస్తున్న ప్రముఖులు

కొండాపూర్, జనవరి 10: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో లోక్ సభ ఎన్నికలు 2024 ఫలితాల విశ్లేషణ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సెమినార్ శుక్రవారం ముగిసింది. ప్రొఫెసర్ ఈ వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో వివిధ విశ్వవిద్యాలయాలు, విజ్ఞాన సంస్థల నుంచి రాజనీతి శాస్త్రవేత్తలు, రాజకీయ పండితులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీల కూటమిలో చేరుతుండటం వలన దేశ రాజకీయాలు జాతీయ పార్టీల చుట్టూ కేంద్రీకతమవుతున్న విషయాలను చర్చించారు. ఈ విధానంతో ప్రాంతీయ పార్టీలు బలపడుతుండగా, కొన్ని బలహీనమవుతున్నట్లు విశ్లేషించారు. ప్రాంతీయ పార్టీలు జాతీయ రాజకీయాలను శాసించడం కాకుండా అందులో అంతర్భాగమతున్నాయన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి ఫలితంగా భారతీయ జనతా పార్టీ పూర్తి స్థాయిలో రాజకీయ ప్రయోజనం పొందిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీఎస్ లోక్ నీతి డైరెక్టర్ సందీప్ శాస్త్రి, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్తలు అశుతోష్ కుమార్, జ్యోతి మిశ్రా, సంజయ్ లోధా, యతీంద్ర సిసోడియా పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆరోగ్య శ్రీ సీఈఓ శివ శంకర్ శుక్రవారం ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేషట్ అధ్యక్షులు డాక్టర శాంతి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ. రఫీయోద్దీన్, వైస్ ప్రెసిడెంట్ ప్రదేశ్, కార్యదర్శులు వెంకట్ నాయక్ రాథోడ్, సర్తజుద్దీన్, శివ, దిలీప్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఈఓకు ఘనంగా సన్మానం చేశారు.

## క్రీడలను భ్రష్టు పట్టిస్తున్నారు

### జితేందర్ రెడ్డిపై వెంకటేశ్వర్ రెడ్డి ఫైర్




హైదరాబాద్, ఆట ప్రతినిధి, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుగా జితేందర్‌రెడ్డి క్రీడలను అభివృద్ధి చేయాల్సింది పోయి భ్రష్టు పట్టిస్తున్నారని సాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ స్పోర్ట్స్ కోడ్ ప్రకారం, అర్హత లేకపోయినా సీఎం రేవంత్ వారించినా తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్(టీవోఏ) అధ్యక్ష పదవికి పోటీ పడిన జితేందర్ రెడ్డి ఇప్పుడు సమాఖ్య భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేశారని ఆయన మండిపడ్డారు. జాతీయ క్రీడలకు జట్ల ఎంపిక విషయంలో టీవోఏను కనీసం పరిగణనలో కి తీసుకోని ఐవోఏ జితేందర్ రెడ్డి వర్గానికి షాక్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం స్పందిస్తూ 'టీవోఏ గుర్తింపునకు నోచుకోకపోవడంతో ఉత్తరాఖండ్‌లో జరుగనున్న జాతీయ క్రీడల్లో పోటీపడే తెలంగాణ ఆటగాండ్లు అయోమయంలో పడిపోయారు. స్వయంగా సీఎం వద్దనున్న క్రీడా శాఖలో ఇలాంటి పరిస్థితి ఉండటం శోచనీయం. ఈ విషయంలో సీఎం కలుగజేసుకుని, జితేందర్ రెడ్డిని సలహాదారు పదవి నుంచి తొలిగించాలన్నారు.

## అన్ని వర్గాలకు మద్దతుగా ఎమ్మార్పీఎస్: మందకృష్ణ




ఖైరతాబాద్, జనవరి 10: ఎమ్మార్పీఎస్ కేవలం దళిత వర్గాలకే కాదు బీసీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు మద్దతుగా నిలుస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, దశాబ్దాల క్రితం దళితులు, అగ్రవర్ణాల మధ్య రిజర్వేషన్ల విషయంలో వివాదం తలెత్తిందని, అయితే, 4 ఏండ్లలోనే అది పరిష్కారమైందని, ఆ తర్వాత మండల్ కమిషన్ అమలు విషయంలోనూ ఆయా వర్గాల మధ్య గొడవలు జరిగాయని, రెండు, మూడేండ్లలోనే అది కూడా పరిష్కారమైందన్నారు. కానీ, ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి ముప్పయ్యేండ్లుగా ఓ వర్గం అడ్డుపడుతోందన్నారు. నేడు అది దాడులకు దారి తీసిందని, రాజ్యాంగ బద్ధంగా అమలు కావాల్సిన వర్గీకరణను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తూనే ఉన్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా అది ఆపడం ఎవరి సాధ్యం కాదన్నారు.



రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన 'కవులు, కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి; - రవీంద్రభారతి

# దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై చర్చ

### పరిసరవాసులతో హైడ్రా కమిషనర్ సమావేశం

### ఎఫ్‌టీఎల్ మారుతున్నదంటూ కాలనీవాసుల ఆరోపణ



దుర్గం చెరువు పరిసరవాసులతో సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ): దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా నాలుగు నెలల్లో పరిష్కారం చూపుతామని లేక్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. హైడ్రా కార్యాలయంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ విషయంలో గతంలో హెచ్ఎండీఏ ఇచ్చిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను పరిసరవాసుల నుంచి రంగనాథ్ శుక్రవారం స్వీకరించారు. వారి వాదనలను రికార్డు చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఒకసారి ఒకలాగా, మరొకసారి మరో మాదిరిగా ఉంటుందని, ఒక్కో శాఖ ఒక్కో తరహాలో ఎఫ్‌టీఎల్ లెక్కలు చెబుతున్నాయని వారు ఆరోపించారు. మిగతా చోట్ల చెరువులు మాయమైతే ఇక్కడ మాత్రం చెరువు ఎఫ్‌టీఎల్ పెరుగుతున్నదని, ఇదెక్కడి వింత అంటూ వారు కమిషనర్‌ను అడిగారు. 25 ఏండ్లుగా ఎఫ్‌టీఎల్ వివాదం కొనసాగుతున్నదని, అప్పుడు వచ్చిన వరదల వల్ల వచ్చిన నీటి పరిమాణంతో ఎఫ్‌టీఎల్ మార్చేశారని, ప్రభుత్వ రికార్డుల్లో 65 ఎకరాలే ఉంటే 165 ఎకరాలు ఎఫ్‌టీఎల్‌గా చూపిస్తున్నారని ఆరు కాలనీలకు చెందిన ప్రతినిధులు కమిషనర్‌కు చెప్పారు. ఖాళీ స్థలాల్లో ఇళ్లు కట్టుకోలేక పోతున్నామని, అవసరాలకు తమ ఇళ్లు అమ్ముకోలేకపోతున్నామని వారు వాపోయారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారించినప్పుడు తమ వాదనలు పరిగణనలోకి తీసుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు. కాలనీవాసుల నుంచి పూర్తి అభ్యంతరాలు తీసుకున్న తర్వాత రంగనాథ్ మాట్లాడుతూ, ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర శాఖలన్నింటినీ భాగస్వామ్యం చేసి పరిష్కారం చూపుతామని తెలిపారు. నాలుగు నెలల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఎఫ్‌టీఎల్ విషయంలో శాస్త్రీయంగా వ్యవహరిస్తామని, ఐఐటి, బిట్స్ పిలానీ, జేఎన్టీయూ వంటి విద్యా సంస్థల ఇంజనీరింగ్ విద్యార్థుల సహకారం కూడా తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. సమావేశంలో దుర్గం చెరువు పరిసర ప్రాంతంలోని ఆరు కాలనీలకు చెందిన ప్రతినిధులు గోపాలకృష్ణ, ఊర్మిళాదేవి, నళినీ, జేవీ చౌదరి, రవీందర్ రెడ్డి, ప్రియతమ్ రెడ్డి, బాషా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కన్జర్వేషన్ జోన్ ఎత్తివేయాలి

### రాచులూరు రైతుల డిమాండ్



మాట్లాడుతున్న జగదీశ్వర్ రెడ్డి

కందుకూరు, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కన్జర్వేషన్ జోన్ ఎత్తివేయాలని కందుకూరు మండల పరిధిలోని రాచులూరు రైతులు డిమాండ్ చేశారు. తమ భూములు ఎకరాకు రూ.4 కోట్ల ధర పలకుతుందని, అందులో సగం ధర చెల్లించి మా భూములను తీసుకోవాలని కోరారు. బేగర కంచె వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రాచులూరు గ్రామ రైతులతో ఆర్‌డీఓ తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్ ధర రూ.23 లక్షలు ఎకరాకు ఉందని 2013 చట్టం ప్రకారం, మూడు రెట్లు చెల్లిస్తుండటంతో ఎకరాకు రూ.70 లక్షలు వస్తుందని ఆయన వారికి వివరించారు. అందుకు రైతులు సమ్మతించ లేదు. తమకు ఉన్న ఎకరం, రెండు ఎకరాలు రోడ్డులో పోతుండటంతో తమకు జీవనోపాధి కష్టం అవుతుందని వాపోయారు. ప్రభుత్వం చెల్లిస్తున్న నష్ట పరిహారం సరిపోదని, ప్రస్తుతం పలుకుతున్న ధర కంటే తగ్గించి కనీసం ఎకరాకు 2 కోట్లకు పైగా చెల్లించాలని కోరారు. అంతే కాకుండా తమ భూములు కనసర్వేషన్ జోన్‌లో ఉన్నాయని వెంటనే ఆ జోన్ ఎత్తివేసి రైతులకు మేలు చేయాలని కోరారు. రైతుల విషయాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ నెల 20వ తేదీన గ్రామంలో సభ నిర్వహిస్తామని ఆర్డీవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాల్, రైతులు బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుయ్యని సామయ్య, సుదర్శన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు

## బీసీల రిజర్వేషన్లను 42% శాతం పెంచి చట్టం చేయాలి

### ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ



ఆళ్ల రామకృష్ణ

రవీంద్రభారతి, జనవరి10: బీసీ కులగణన పూర్తి అయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి రిజర్వేషన్లను పెంచాలని ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. బషీర్‌బాగ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ప్రకారం, రిజర్వేషన్ శాతాన్ని 20 నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిందని, ఆ ప్రకారం రిజర్వేషన్ల శాతాన్ని 20 నుంచి 42 శాతానికి పెంచి అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం చేయాలని, అప్పుడే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు ఉందని, న్యాయపరమైన అవరోధాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించినందున, బీసీల రిజర్వేషన్ శాతాన్ని పెంచుతూ అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 55 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజరేషన్లు లేక వెనుకబడిపోయారని అన్నారు. రాష్ట్రంలో 5, 6 శాతం ఉన్న అగ్రకులాలు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, బీసీలు మాత్రం పాలకులకు పల్లకీ మోసే బోయీలుగా మారిపోయారని ఆళ్ల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. 76 ఏండ్ల నుంచి బీసీలు రాజకీయంగా ఆర్థికంగా ఎంతో వెనుకబడిపోయారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి చట్ట సభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేసన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళితే సహించం

### బీసీ మేధావుల సమాలోచన సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

ఖైరతాబాద్, జనవరి 10: బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని చూస్తే సహించమని వక్తలు అన్నారు. అఖిల భారత బీసీ ఫెడరేషన్, బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన బీసీ మేధావుల సమాలోచన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ, తమిళనాడులో గతంలో బీసీల రిజర్వేషన్లను 69% పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేసి, దాని అమలు చేయాలని అఖిల పక్షంతో ఢిల్లీకి వెళ్లి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 9వ షెడ్యూల్‌లో చేర్పించారని గుర్తు చేశారు. ప్రస్తుతం, తెలంగాణ ప్రభుత్వం సైతం ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేయాలని చూస్తే బీసీ సమాజం ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోదని, రాష్ట్ర ప్రభుత్వం సైతం చడీచప్పుడు కాకుండా వ్యవహరిస్తోందని, ఈ వైఖరి మార్చుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ఫలితంగా మొదలైన సమగ్ర కులగణన సంపూర్ణం కాలేదని, వంద శాతం పూర్తి కావాలంటే మరో వారం రోజులు ప్రత్యేకంగా కులగణన చేపట్టాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ న్యాయ నిపుణులు, అఖిలపక్ష పార్టీలు, బీసీ మేధావులు, బీసీ సంఘాలతో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి కులగణన, బీసీ రిజర్వేషన్లపై రూట్ మ్యాప్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాశ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీసీ మేధావుల ఫోరం కన్వీనర్ ప్రొ. మురళీ మనోహర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్ పాల్గొన్నారు.